# ధన్యజీవి

## మద్దిరాల విజయశ్రీముఖి

సెలవు రోజు కావటం వలన ఆఫీసులేదు ఇంట్లోనే సరదాగా గడుపుదామంటే శ్రీమతీ, పిల్లలు ఊళ్ళోలేరు చేసే పనీలేదు ఏదైనా చదవాలనే ఆసక్తి లేదు

లేచి డ్రెసప్ అయ్యాను.

మేమున్న వీధికి అవతలి వీధిలో నా కొలీగ్ శర్మ ఉంటున్నారు వాళ్ళింటికి వెళ్ళి ఆయనతో కాసేపు బాతాఖానీకొట్టి, టైం పాస్‌చేసి అట్నుంచి హోటల్‌కు పోవచ్చు అనుకున్నా.

"శర్మగారున్నారాండీ?'

వాళ్ళ శ్రీమతి కనిపిస్తే అడిగాను

ఉన్నారు స్నానం చేస్తున్నారు "

'సరే, చేయనివ్వండి తొందరేం లేదు అందాక ఇలా కూర్చుంటాను "

అంతకు ముందు పరిచయమున్న ఫామిలీయే కనుక చనువుగా, ఆమె చెప్పకముందే అక్కడున్న కుర్చీలో కూర్చుని ప్రక్కనే ఉన్న పేపరు తీసుకున్నాను

ఏదో చప్పుడవటంతో అప్రయత్నంగా తలత్రిప్పి చూశాను అటువేపు

బాత్‌రూమ్ తలుపు చేసిన సవ్వడి అది నేను కూర్చున్న చోటికి పెరట్లో ఉన్న బాత్‌రూమ్ లోనికి వెళ్ళేవారు, వచ్చేవారు కనిపిస్తూనే వుంటారు

శర్మ, మరో స్త్రీ పనిమనిషిలా వుంది మరి వాళ్ళిద్దరి మధ్యగా ఒక వృద్ధురాలు నాకు తెలుసు ఆమె శర్మ తల్లిగారు

పనిమనిషి కూడా ఆసరాగా ఉన్నా, ఇంచుమించు తల్లి భారాన్నంతా తన మీదనే వేసుకుని నెమ్మదిగా నడిపించుకుని వస్తున్నాడు శర్మ

నాకు ఆశ్చర్యంగా వుంది

శర్మ శ్రీమతి చెప్పినట్లు స్నానం చేసింది శర్మకానే కాదు అతని లుంగీ! బనియన్ సగం తడిసిపోయి ఉన్నాయి అతని తల్లి మాత్రం అప్పుడే స్నానం చేసినట్లుగానూ అలసటగానూ, అస్తవ్యస్తంగా చుట్టిన చీరెతో నూ వున్నది

వాళ్ళు నా దృష్టినుండి తప్పుకుని అవతలి గదిలోనికి వెళ్ళిపోయారు

ఇదేమిటి? మగవాడు! శర్మ తాను చేయించట మేమిటి స్నానం? ఎంత తల్లయితే మాత్రం?'

ఎబ్బెట్టుగా అనిపించింది నాకు

భార్య ఉంది కదా? చేయించదా? అంత చెప్పి చేయించలేని అసమర్థుడా?

పోనీ ఎటూ పనిమనిషి ఉంది కదా? మరో పదో, పరకో ఎక్కువిచ్చి ఆమెనే చేయించేయ మనకూడదా?.

నా ఆలోచనలు చెదరగొట్టాయి శర్మ భార్య మాటలు 'మీ కసలు సిగ్గూ, లజ్జా లాంటివేం లేవు సరికదా, మీతోపాటు ఉన్నవాళ్ళకూడా ఉండనిచ్చేలా లేరు, ఛీఛీ "

ఏం ఇప్పుడు నీ సిగ్గుకు చిన్నతనమేమొచ్చింది?"

విసుగ్గా అడుగుతున్నాడు శర్మ

"జయపాల్ గారొచ్చి అడిగితే మీరు స్నానం చేస్తున్నారని చెప్పాను ఇప్పుడు లోపలికి వచ్చేప్పుడు చూశారో ఏమో?"

"చూస్తే ఏం? నేనేం ఖూనీ చేశానా? చోరీ చేశానా? చేసే ఓర్పులేదు చేస్తుంటే ఓర్చుకునే శక్తి లేదు ఛ '

అసహనంగాఅంటున్నాడు శర్మ

ఈ సమయంలో రాకుండా ఉండాల్సింది నేను ఇప్పుడు చెప్పకుండా లేచి వెళ్ళిపోవటం బావుండదేమో

"ఇదిగో, చూడు నరసమ్మా, ఆ పౌడరు తెచ్చి, అమ్మకు ఒళ్ళంతా ఒత్తుగా రాయి

రాశాక, పళ్ళరసం త్రాగించు

పని మనిషికి పురమాయిస్తున్నాడు శర్మ

'మొహాలకు రాసుకోవటానికే నెలకో డబ్బా చాలటం లేదని ఛస్తుంటే, ఒంటికీ, ఇంటికీ కూడా వాడితే ఇంకెలా బాగు పడతాం? వచ్చే జీతం కాస్త ఈ సేవలకే సరి

శర్మ శ్రీమతి గొణుగుడు స్పష్టంగా వినిపిస్తుంది

"హలో, ఎంత సేపయ్యింది మీరొచ్చి'?

శర్మ పలకరింపుతో ఆలోచనలు విడిపోయాయి

చెప్పాను

ఫామిలీ వచ్చేశారా?

'లేదు అందుకే మీ యింటి మీదకు దండెత్తాను, బోర్ భరించలేక"

"ఓ కె ఫైవ్ మినిట్స్'

అంటూ లోపలికి వెళ్ళి పోయాడు శర్మ

అతను వెళ్ళిన ఐదు నిముషాలకు నాకు కాఫీ వచ్చింది

ఆ తర్వాత పావు గంటలో అతను స్నానం చేసి రెడీ అయి వచ్చాడు

ఇద్దరం కలిసి బైటపడ్డాం

ఏం మాట్లాడాలో తోచక మౌనంగా నడవసాగాము

వాళ్ళింట్లో సంభాషణ విన్నానేమోనని ఆయన ఫీల్ అవుతున్నాడేమో ననిపిస్తుంది నాకు

చివరికి నేనే అన్నాను

ఏమిటండీ ఆలోచిస్తున్నారు?

"అమ్మ గురించేనండీ "

"ఏమిటి మీ అమ్మగారి అనారోగ్యం?

'పక్షవాతంలా వచ్చింది ఓ కాలు, చెయ్యి స్వాధీనంలో ఉండవు మాటకూడా సరిగా మాట్లాడలేక పోతుంది

కొన్నాళ్ళు హాస్పిటల్‌లో ఉంచాము ఆశించినంత మెరుగేం కనిపించలేదు ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంచి ట్రీట్‌మెంటిప్పిస్తున్నా '

కొన్ని క్షణాలాగి అడిగాను

మీ తోబుట్టువు లెండరండీ? సిస్టర్స్ ఉన్నారా?

అర్థమయినట్లు అదోలా నవ్వాడు శర్మ నవ్వి అన్నాడు

'ఎవరూ లేరండీ, ఒక్కడినే నాన్న పదేళ్ళ క్రితమే పోయారు

కాసేపాగి, మళ్ళీ శర్మే అన్నాడు,

జయపాల్‌గారూ, అమ్మకు నేనే స్నానం చేయించటం మా ఆవిడకు చిరాకు కల్గించినట్లు, మీకో సందేహాన్ని కల్గించిందా?

"నో నో నేనసలు దాని గురించే ఆలోచించ లేదండీ?' బుకాయించబోయాను

"ఆల్‌రైట్, పోనివ్వండి, నేనే చెప్తాను అంటూ ఆగి, క్షణం తర్వాత చెప్పసాగాడు శర్మ

"అమ్మ మంచాన పడి తన పనులు తాను చేసుకోలేని అశక్తురాలయిన తర్వాత కొన్నాళ్ళవరకీ నేనామె పనులు గురించి ప్రత్యేకంగా పట్టించుకో లేదు

కారణం, ఇంట్లో మిగతా పనుల్లాగే అమ్మ బాధ్యత కూడా శ్రీమతే చూసుకుంటుందనే భరోసాతో

మందులూ, పళ్ళూ తేవటం, యోగక్షేమాలు కనుక్కోవటంతో నా పని అయిపోయిందనుకునే వాడిని

కానీ తరువాత్తరువాత తెల్సిందేమంటే శ్రీమతి నేను నమ్మినంత సహనవంతురాలు కాదు అనే నిజం

నన్ను కని పెంచిన తల్లి, మన శ్రేయోభిలాషిణి అయిన ఆమె అనారోగ్యంతో, వృద్ధాప్యంతో అసహాయురాలుగా వుంది మనం చూడాల్సిన వయస్సు, సమయం ఇదే

కన్నవారు తమ బిడ్డల మీద కురిపించే కొండంత ఆప్యాయతలో దాగిన రవ్వంత ఆశకూడా ఈ స్థితిలో చూస్తారనీ, చూడాలనే"

అంటూ ఎన్నోసార్లు నచ్చ జెప్పాను, అనునయంగా

ఫలితం లేదు ఆగ్రహించాను అధికారంతో ఆజ్ఞాపించాను జవాబుగా, నాతో ఎదిరించక పోయినా

నా మీది కోపం, విసురూ, అమ్మమీది విసుగూ అన్నీ కలిపి చూపులను, మాటలను ఈటెలుగా చేసి అమ్మమీద సంధించేది

మరో చిత్రం చెప్పమంటారా?

మనకు తెల్సినంత వరకీ అత్తలు ఆరడి పెట్టటం, కోడళ్ళు భరించటం అనేది సర్వ సాధారణంగా చెప్పుకుంటారు

కానీ, మా యింట్లో మాత్రం రివర్స్

కోడలే చిరాగ్గా మాట్లాడటం, చిందులు త్రొక్కటం అమ్మ అవన్నీ నావరకు రాకుండానే సరిపెట్టుకోవటం

తెలీనట్లు నటించే నాకు తెల్సిన సత్యం! ఎలాగో

వాళ్ళూ వాళ్ళే క్రిందా మీద పడి, సర్దుకు పోతారు నేను కల్పించుకుని తెగేదాకా లాగటం మంచిది కాదనుకుని తటస్థంగా ఉంటుండే వాడిని

ఓ రోజు నేను ఆఫీసు నుండి వచ్చాక అమ్మను పలకరిద్దామని ఆమె గదిలోనికి వెళ్ళాను

మంచంలో పడుకున్న అమ్మ క్రొత్తగా కనిపించింది ఆరోజు

పరిశీలనగా చూశాను

మా ఆవిడ చర్యకు నిప్పులు కురిపించేలా ఉన్ననాకళ్ళు అమ్మ మొహాన్ని చూసి వెచ్చని నీళ్ళను బొట్లు బొట్లుగా రాల్చాయి

నలుపూ, తెలుపుల సమ్మేళనంతో ఒత్తుగా ఉండే తలకట్టుతో, గంభీరంగా కనిపించే అమ్మ

నున్నటి బోడిగుండుతో పిచ్చిదానిలా భిక్షుకిలా నాగుండెను నలిపేస్తూ

చూడలేక, వేగంగా వెను తిరిగాను

'తలలో పేలుపడ్డాయి, రోజూ పని పెట్టుకుని చూసి, చిక్కులు తీసే ఓపిక, తీరిక నాకు లేవు అయినా ఇంకా ముసలిదానికి జుట్టు లేక పోతే నష్టం ఏమిటట?

అదీ శ్రీమతి నిర్లక్ష్యపు జవాబు లాంటి ప్రశ్న జుట్టు ఎవరికి లేక పోయినా వచ్చే నష్టం ఏం లేదు

జుట్టుతో ఉండాలా? గుండుతో ఉండాలా? అనేది కాదు సమస్య

అవతలివ్యక్తి దయనీయస్థితిలో ఉన్నప్పుడు, మనం కర్కశంగా ప్రవర్తించి వాళ్ళను వేధించ కూడదనే నా ఉద్దేశం

రాగా, రాగా, అమ్మ దగ్గరకు వెళ్ళి కూర్చుంటుంటే, ఓ విధమైన దుర్వాసన రాసాగింది

కారణం ప్రతిరోజూ ఆమెకు శుభ్రంగా స్నానం చేయించి, బట్టలు మార్చక పోవటమే.

శ్రీమతిని తిట్టి, కొట్టి రోజూ ఆపని ఆమెతో చేయించవచ్చు కానీ ఇష్టం లేకుండా, ఆమెను అటు నెడుతూ, ఇటు నెడుతూ, చేసే సేవలు ఎంత సున్నితంగా, సుఖంగా ఉంటాయో ఆలోచించండి

ఉన్నవ్యాధికి, ఈ అవస్థలు తోడు చేసినట్లవుతుంది కదా?

పని మనిషి మీద వదిలేస్తే కాస్త భారీ శరీరం గల అమ్మ ఒక్కదానికీ అలవికాదు

అందుకే అప్పటి నుండీ పని మనిషి సాయంతో అమ్మ అవసరాలన్నీ నేనే చూస్తున్నాను

చూపు, వినికిడి తప్ప మాట లేని అమ్మ, మొదటి రోజు స్నానం చేయించబోతే

కన్నీరు కాల్వలు కడుతూంటే, కుంచించుకు పోతున్న శరీరంతో, దణ్ణం పెట్టినంత పని చేస్తూ, 'వద్దు వద్దంటూ' నన్ను వారించ బోయింది

ఉండమ్మా నేను స్నానం చేస్తూంటే నాకూ మీరే చేయించండి నాన్నగారూ అంటూ వచ్చే మన బేబీకి నేను చేయించటం లేదూ? నీవూ అంతే

అయినా అమ్మా నేను ఎనిమిదో తరగతి చదివే వరకు నీవు నాకు నలుగు పెట్టి, ఒళ్ళు రుద్ది, నీళ్ళు పోసే దానివి కాదూ? ఇప్పుడు నేను



పెద్దాడినయ్యాను నీవే పసి పాప లాంటిదానవు

నా బదులు తీర్చేసుకోనీ అమ్మా

ఈవిధంగా నచ్చ జెప్పే వాడిని

మా ఆవిద అడుగుతూంటుంది

మీరలా చేయటం ఎవరేనా చూస్తే ఏమను కుంటారు?' అని

ఏమనుకుంటారు?

నేను మగాడినే కావొచ్చు

కానీ, అమ్మను మించిన మొనగాడినేం కాదుగా?

ఆమె స్త్రీ కావచ్చు అందుకే నాకు జన్మనిచ్చి, పాలిచ్చి పెంచిన నాతల్లి అయ్యింది

ఏ స్థితిలో ఉన్నా ఆమె నా తల్లి

ఎంత వయసొచ్చినా నేనామె బిడ్డను దట్సాల్

నా వెనుకే అయినా, కొందరేమని కామెంట్ చేస్తున్నారో తెల్సండీ? అడిగాడు శర్మ

ఏమంటున్నారు?

పెళ్ళానికి చెప్పి చేయించలేని వాజమ్మనని బట్ ఐ డోంట్ కేర్‌దట్

ఎందుకంటే, బాధలు అర్థం చేసుకునే వాళ్ళకు, బాధ్యతలు పంచుకునే వాళ్ళకు మనం ప్రాధేయపడి చెప్పక్కర్లేదు

ఆ రెండూ తెలియని వాళ్ళకు చెప్పీ వ్యర్థమే ఏమంటారు?"బాధగా నవ్వుతూ అడిగాడు శర్మ

నిజమే

నెమ్మదిగానే అయినా, మనస్ఫూర్తిగా అన్నాను

సో మరొక్కమాట

## "ధన్యజీవి"

ఏమిటన్నట్లుగా చూశాను నేను

మీరేదో చూశారని గాని, మా ఆవిడ మాటలు విన్నారనిగానీ నేను గిల్టీగా ఫీలవుతూ, ఇవన్నీ మీకు చెప్పటం కాదండీ

ఆలోచనతో గుండె బరువెక్క ఏదో మీకు ఫ్రెండ్లీగా

శర్మ మాటలు పూర్తిగాక ముందే నేనన్నాను

థాంక్యూ

కానీ నామనస్సులో ఏదో అలజడి రేగింది నేనూ, చెల్లాయి అమ్మా, నాన్న సంతానం

దాదాపు నాలుగేళ్ళ క్రితం అమ్మ చనిపోయింది నాన్న నా దగ్గరే ఉంటుండే వారు

ఆయన బాగున్నప్పుడే సమస్యా ఉండేది కాదు కానీ, ఏ కాస్త నలతగా ఉన్నా, ఆయన మందుల కన్నా, ఆహారం కన్నా పదేపదే 'అమ్మాయికి కబురు చేయరా' అనేవారు

నా భార్య అంటుండేది

ఎప్పటి కప్పుడు చచ్చిపోతున్నట్లు కూతుర్ని పిలవ మంటారేం మీనాన్న? ఏం మనం మనుషులం కాదా? అని

నిజానికి నాకూ ఆయన ఆదోరణి విసుగూ, కోపాన్ని తెప్పించేది చివరికి నాన్నతో చెప్పేశాను

"మీరు వెళ్ళి చెల్లాయి దగ్గరే ఉండండి నాన్నా మీరు అవును, కాదన్నా మీ కోడలు చెప్పినట్లు, నా మీద కంటే చెల్లాయి మీదే మమకారం ఎక్కువ

అయినా పర్లేదులే ఎప్పుడన్నా డబ్బులు పంపుతూ వచ్చి చూస్తుంటానులే

అని పంపాను ప్రస్తుతం ఆయనక్కడే ఉన్నారు కానీ నా కప్పుడనిపిస్తోంది

ఈ వయస్సులో వాళ్ళు బిడ్డల నుండి ఆశించేది ముక్కుబడిగా పెట్టే తిండికోసం కాదని

దగ్గర కూర్చుని అభిమానంగా, ఆత్మీయంగా పలకరించే తీరు కోసమే తపిస్తారేమోనని,

శర్మ మాటలు నా ఆలోచనలను చెల్లా చెదురు చేశాయి

అరే మాటల్లో పడి చాలా దూరం వచ్చేశాం సరదాగా గడుపుదామని వచ్చిన మీకు నాగొడవంతా చెప్పుకుంటూ తలనొప్పి తెప్పించానేమో కదూ"

లేదండి పైకి సామాన్యంగా, చిన్నగా కనిపించే విషయాల వెనుక ఎలాంటి బాధలు దాగుంటూ ఉన్నాయో వివరించారు

ముందు హోటల్‌కు పదండి ఓ స్ట్రాంగ్ టీ తాగుదాం అంటూ అటు దారి తీశాడు శర్మ అనుసరించాను

శర్మా, మీ అమ్మలాంటి అమ్మలు చాలా మందిని ఉంటారు గానీ, మీ లాంటి కొడుకులు ఎందరుంటారు?

అందుకే మీరు కాదు మీ అమ్మ ధన్యజీవి శర్మతో అనలేదు అనుకున్నాను లోలోన ☐





